# నమస్తే తెలంగాణ
# మహబూబ్‌నగర్
## నారాయణపేట

3 | మహబూబ్‌నగర్, శుక్రవారం 6 డిసెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET


## విద్యార్థులకు అస్వస్థత



విద్యార్థులను పరామర్శిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

భూత్పూర్, డిసెంబర్ 5 : భూత్పూర్‌లోని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిప్సీ బాలికల వసతి గృహానికి చెందిన ఇద్దరు బాలికలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉపాధ్యాయుడు రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం జిప్సీ వసతి గృహానికి చెందిన ఇద్దరు బాలికలు జెడ్పీహెచ్‌ స్కూల్‌లో చదువుతున్నారు. గురువారం జిప్సీ హాస్టల్‌కు చెందిన కె.మౌనిక, వి.మౌనిక అస్వస్థతకు గురయ్యారు. వెంటనే హాస్టల్ నిర్వాహకులకు సమాచారమివ్వగా వారు అందుబాటులో లేకపోవడంతో జిల్లా దవాఖానకు తరలించామని చెప్పారు. డీఈవో ప్రవీణ్‌కుమార్ దవాఖానకు చేరుకొని విద్యార్థులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

## ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్లపై కేసు

నారాయణపేటరూరల్, డిసెంబర్ 5: పేట మండలంలోని సింగారం శివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్న 6 టిప్పర్లు, ఒక జేసీబీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. పేట ఆర్‌ఐ ప్రతాప్‌రెడ్డి వాహనాలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## హరీశ్‌రావు అరెస్ట్ అక్రమం



గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో హరీశ్‌రావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- ప్రభుత్వానిది పైశాచిక ఆనందం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): అనుక్షణం ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావును అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన హరీశ్‌రావును సింగిరెడ్డి గురువారం పరామర్శించి సంఘీభావం తెలిపారు. అరెస్ట్‌పై నిరంజన్‌రెడ్డి ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదును తీసుకోనందుకు బాధ్యతగల ఎమ్మెల్యేగా హరీశ్‌రావు పోలీసు అధికారులను ప్రశ్నిస్తే అతడిని అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఓ ఎమ్మెల్యే కోసం వెళ్లిన హరీశ్‌రావును నిర్లక్ష్యంగా నెట్టుకుంటూ దౌర్జన్యంగా అరెస్ట్ చేయడం సరైందికాదని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే అసహనానికి గురై ప్రజల తరఫున నిలబడి ప్రశ్నిస్తున్న హరీశ్‌రావు, కేటీఆర్‌ను ఎలాగైనా అరెస్ట్ చేసి పైశాచిక ఆనందం పొందాలని ప్రయత్నిస్తున్న ప్రభుత్వ బాధ్యుల చర్యలను తిప్పికొడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలన, తిరోగమన పాలన కొనసాగుతున్నదని, సంక్షేమ పథకాలకు కోత విధించి, కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పథకాలను రద్దు చేస్తూ రోజుకో అనాలోచిత ప్రకటనలను ప్రభుత్వం చేస్తున్నదని దుయ్యబట్టారు. అక్రమంగా అరెస్ట్ చేసిన ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేసి కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## చివరి మజిలీకి తప్పని తిప్పలు





మంగలోని వంపులో పారుతున్న నీటిలో నుంచి పాడెను తీసుకెళ్తున్న దృశ్యం, నీటిని దాటుతున్న మహిళలు

- నీటిలోనే పాడెను మోసుకెళ్తున్న ప్రజలు
- కల్వర్టు నిర్మించాలని ప్రజలు, రైతుల వేడుకోలు

మరికల్, డిసెంబర్ 5 : నారాయణపేట జిల్లా మరికల్ మండలకేంద్రంలో చివరి మజిలీకి ఇక్కట్లు తప్పడం లేదు. మరికల్ మండల కేంద్రంలోని నాయీబ్రాహ్మణ శ్మశానవాటిక వద్దకు మృతదేహాన్ని పూడ్చేందుకు తీసుకెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. మరికల్ నుంచి పెద్దచింతకుంట దారిలోని శ్మశానవాటిక వద్దకు వెళ్లే మంగలోని వంపులో నీరు పారుతున్నది. దీంతో ఎవరైనా మరణిస్తే ఇదే నీటిలో నుంచి శ్మశానవాటికకు వెళ్లాల్సి వస్తున్నది. అయితే, గతంలో ఈ రోడ్డును ఉపాధి హామీ పథకంలో భాగంగా మరమ్మతులు చేపట్టారు. అలాగే రైతులు కూడా ఇదే నీటిలో పొలాలకు వెళ్లాల్సి వస్తున్నది. ఎమ్మెల్యే స్పందించి ఈ దారిలో కల్వర్టు నిర్మించాలని నాయీబ్రాహ్మణులు, రైతులు కోరుతున్నారు.

## దోమలపెంట జీపీ కార్యదర్శి సస్పెన్షన్

దోమలపెంట, డిసెంబర్ 5 : అమ్రాబాద్ మండలంలోని దోమలపెంట పంచాయతీ కార్యదర్శి జయంత్ విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా కలెక్టర్ బదావత్ సంతోష్ సస్పెన్షన్ చేసినట్లు ఎంపీడీవో వెంకటయ్య గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి దోమలపెంటలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన పన్నులను జీపీ నిధులకు జమ చేయలేదని, పంచాయతీ నిధులను సొంత అవసరాలకు వాడుకున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ నిర్వహించగా పై విషయాలు రుజువు కావడంతో కలెక్టర్ సస్పెన్షన్ విధించారు.

*నల్లమలలోని గుట్టలు తరిగిపోతున్నాయి. అటవీ ప్రాంతం చినబోతోంది. పెద్దపులుల గాండ్రింపు అధికార దాహంతో నిండిన నాయకుల స్వార్థంతో మూగబోతున్నది. మయూరాల నాట్యంతో పర్యాటకులను అలరిస్తున్న నెమలి గూడు చెదిరిపోతోంది. ఖనిజ సంపద దారితప్పడమే కాకుండా ఆయుర్వేద వనమూలికలతో వందలాది సంవత్సరాల వయస్సు ఉన్న భారీ వృక్షాలు సైతం నేలకొరుగుతున్నాయి. నల్లమల అభయారణ్యంలో ప్రశాంతంగా ఉన్న సకల జీవరాశి భయం గుప్పిట్లో గూడు చెదిరి చెల్లాచెదురవుతున్నాయి. కొల్లాపూర్ సమీపంలోని నల్లమల గట్టు కనుమరుగవుతోంది. వేలాది ట్రిప్పుల ఎర్రమట్టి అక్రమంగా తరలిపోతుంది. కొందరు అక్రమార్కులు గట్టును మాయం చేస్తున్నా.. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.*

*- మహబూబ్‌నగర్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

- కొల్లా పూర్ వద్ద చిన బోతున్న నల్లమల
- గుట్టలను మాయం చేస్తున్న అక్రమార్కులు
- వేలాది ట్రిప్పుల ఎర్రమట్టి తరలింపు



# అనకొండలు!

- నేల కూలుతున్న వందల ఏండ్లనాటి చెట్లు
- మామూళ్ల మత్తులో అధికారులు
- పర్యావరణాన్ని కాపాడాలంటున్న స్థానికులు

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో అధికార ప్రోద్బలంతో అక్రమార్కులు నల్లమలలోని ఓ గట్టును మాయం చేస్తున్నారు. సహజసిద్ధ అందాలకు నిలయంగా కొల్లాపూర్ నల్లమల గట్టుకు కొందరు బోడిగుండు కొట్టి అంద వికారంగా చేస్తున్నారు. పర్యావరణం తోపాటు వేలాది చెట్లను నరికి వేస్తున్నారు. ఎర్రమట్టి కోసం జరుగుతున్న ఈ తతంగం అధికారుల కండ్లముందు జరుగుతున్నా ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడంతో ముడుపులు తీసుకొని పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొల్లా పూర్ నుంచి పర్యాటక ప్రదేశాలైన సోమశిల, కృష్ణానది తీరానికి వెళ్లే ప్రధాన రహదారికి రెండు వైపులా ఉన్న గట్టును పట్టపగలే కొల్ల గొడుతున్నా.. ఏ అధికారి అటు వైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలున్నాయి. కొల్లాపూర్‌లో మట్టి మాఫియా చేసే అరాచకం ఇందుకు అద్దం పడుతోంది. హైవే కోసం సర్వే నెంబర్ 69, 70, 71లలో నాలుగున్నర ఎకరాల్లో 20 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తీసేందుకు రూ.10 లక్షలు చలానా, గట్టుపై ఉన్న విలువైన చెట్లను వంట చెరుకుగా చూపి రూ.10 వేల చలానా కట్టారు. అయితే అక్టోబర్ రెండో వారంలో గట్టును తవ్వడం ప్రారంభించి ఇప్పటివరకు కేవలం వెయ్యి టిప్పర్లు మాత్రమే మట్టి తీసినట్లు గుత్తేదారులు చెప్పుతున్నారు. కానీ.. ఇప్పటికే దాదాపు పరిమితికి మించి 30 క్యూబిక్ మీటర్లలో మట్టి తరలించినట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా హైవే పేరిట మట్టిని తరలిస్తూ అధికార పార్టీ నేతలు కొందరు వారి పొలాలకు రోడ్లు వేసుకుంటున్నారని సమాచారం. ఫారెస్ట్, రెవెన్యూ వివాదంలో ఉన్న ఏరియాలో బహిరంగంగా గట్టును తవ్వుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గట్టును నాశనం చేయకుండా పూర్వపు పట్టాలు ఉండి పంటలు పండించుకుంటున్న తమపై జులుం ప్రదర్శించే అధికారులు కండ్ల ముందు.. వేలాది చెట్లను నరికేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులకో న్యాయం..? రాజకీయ నాయకులకు మరో న్యాయమా..? అంటూ నిలదీశారు. వేలాది టిప్పర్లతో మట్టి తవ్వుతున్నా పట్టించుకోని సంబంధిత మైనింగ్ అధికారుల పాత్రపై కూడా అనుమానం ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు, అధికార పార్టీ నాయకులు కలవడం తోనే నల్లమల గట్టు నల్లబుచ్చుకుంటుందని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. తక్షణమే తవ్వకాలను నిలిపివేసి చెట్ల నరికివేత, ఎన్ని క్యూబిక్ మీటర్ల మట్టి తీశారో వంటి అంశాల తోపాటు అధికార దుర్వినియోగంతో గట్టు మట్టితో రోడ్లు వేసుకున్న వారిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. తవ్వకాలపై వివరణ కోసం 'నమస్తే తెలంగాణ' ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అందుబాటులోకి రాలేదు. మైనింగ్ అధికారులు మాట్లాడేందుకు కూడా భయపడుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం గట్టుపై లక్షలాది చెట్లు ఉంటే కేవలం 15 చెట్లకు రూ.ఐదు వేలు చలానా కట్టినట్లు తెలుస్తోంది.





నల్లమల గట్టును కొల్లగొడుతున్న జేసీబీ, అధికార పార్టీ నేతల పొలాలకు వెళ్లేందుకు వేసుకుంటున్న మట్టి రోడ్డు

**చెట్లు నరికినందుకే కేసు..**

కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం మా పరిధిలో లేదని, చెట్ల నరికివేతపై కేసు నమోదు చేశామని, అంతకు మించి తమకేమీ తెలియదని చెప్పారు.

## ఇంకెంత మందిని పొట్టనపెట్టుకుంటారు?

- విద్యార్థులకు సరైన భోజనం పెట్ట లేని ప్రభుత్వ మెడలు వంచుతాం : బీహెచ్ చిన్న ... (top bullet as printed: ప్రభుత్వ మెదుకు : బీహె ఛన్)
- ప్రజాపాలన నాయకులు, అధికారులు తనిఖీ చేయరు, మమ్మల్ని చూడనివ్వరు: పల్లయ్య
- నాడు ఉద్యమంలో విద్యార్థులను చంపారు, నేడు కల్తీ ఆహారంతో..
- విద్యార్థుల ఉసురు పోసుకోనిదే కాంగ్రెస్‌కు నిద్ర పట్టదు
- గురుకులాలను సందర్శించిన బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు

ధరూరు, డిసెంబర్ 5: గురుకుల పాఠశాల గేట్లు మూసుకుని ఇంకా ఎంత మంది విద్యార్థులను పొట్టన పెట్టుకోవాలని ప్లాన్ వేశారో చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతు నాయుడు ప్రభుత్వంపై మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం మండలంలోని ర్యాలంపాడు క్వార్టర్స్‌లో నిర్వహించబడుతున్న కేటీదొడ్డి మండల మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాన్ని సందర్శించేందుకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి వెళ్లారు. కాగా ప్రిన్సిపాల్ లోపలికి రానివ్వకుండా గేట్లు వేశారు. ఇదేంటని ప్రశ్నించగా.. ప్రభుత్వం నుంచి మాకు అనుమతులు లేవు, ఎవరినీ రానివ్వొద్దని ఆదేశాలున్నాయన్నారు. దీంతో నాయకులు గేట్ బయటే ఉండి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు విద్యాలయంలో ఉన్న సమస్యలపై బీఆర్ఎస్ నాయకులకు వివరించారు. దీంతో బీహెచ్ చిన్న గురుకుల పాఠశాలలపై వ్యవహరిస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్య తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులకు సరైన మౌలిక వసతులు, భోజనం పెట్టలేని ప్రభుత్వం ఎందుకని ధ్వజమెత్తారు. ప్రజాపాలన సర్కారు నాయకులు విజిట్ చేయరు.., ప్రభుత్వ అధికారులు సందర్శించరు.. మేమన్నా చూద్దామంటే చూడనివ్వరు.., సరే సక్రమంగా నడుపుతారా అంటే అన్ని సమస్యల వలయంలోకి నెట్టుతారు. ఇదేనా మీ పోకడని విమర్శించారు. విద్యార్థులను చంపడానికే కంకణం కట్టుకున్నారా ఏంది, ఖబడ్దార్ కాంగ్రెస్ ప్రభుత్వమా, రేవంత్‌రెడ్డి నీకు విద్యార్థుల తల్లిదండ్రుల ఉసురు తగులుద్ది, అందులో నువ్వు కొట్టుకుపోయే కర్మ దగ్గరలోనే ఉందని గుర్తించుకోవాలని హెచ్చరించారు. బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు విద్యార్థులను బలి తీసుకోవడం అలవాటైపోయింది. నాడు ఉద్యమంలో తెలంగాణ ప్రకటనను నిర్లక్ష్య ధోరణితో 1200 మంది విద్యార్థులను పొట్టన పెట్టుకుంది, నేడు నాణ్యత లేని ఆహారం పెడుతూ గురుకుల విద్యార్థులను చంపడానికి కంకణం కట్టుకుందని ఆరోపించారు. విద్యార్థుల చావు కేకలు వినకుంటే కాంగ్రెస్ కంటికి నిద్ర పట్టనట్టుందని.. ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి ఇక ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరిగినా నీ గుడ్డలూడదీసి నడివీధిలోకి ఈడ్చుకపోతే మేము కేసీఆర్ సైనికులమే కాదని గుర్తుంచుకో.., నాడు ఉద్యమంలో కేసీఆర్‌నే చంపడానికి ప్లాన్ వేసిన కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నం.. రేవంత్‌రెడ్డి కాస్కో మా బీఆర్ఎస్ తడాఖా అని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుమలేశ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ఎండీ మాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గేట్ బయట నిలబడి విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## నల్లమల ఆణిముత్యం

- నాటక, క్రీడా రంగంలో రాణిస్తున్న శ్రీశైలం జెన్‌కో ఉద్యోగి ఉసేనప్ప
- బుల్లి, వెండితెరలోనూ కమేడియన్‌గా..
- పలువురిచే అభినందనలు

దోమలపెంట, డిసెంబర్ 5 : నాటక, క్రీడా రంగంలో రాణిస్తున్న నల్లమల ఆణిముత్యం, జెన్‌కో ఉద్యోగి పలువురితో శభాష్ అనిపించుకుంటున్నాడు. అమ్రాబాద్ మండలం దోమలపెంట, ఈగలపెంట టీజీ జెన్‌కోలో 1996నుంచి జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా బోయ ఉసేనప్ప విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉద్యోగ బాధ్యతలు చేపడుతూనే నాటక రంగం తోపాటు ఇష్టమైన బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలో సత్తా చాటుతున్నాడు.



బాల్‌బ్యాడ్మింటన్‌లో వచ్చిన బహుమతులతో ఉసేనప్ప

***బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ***

బోయ ఉసేనప్పకు ప్రస్తుతం 52 ఏండ్లు.. 1984 నుంచే క్రీడా, నాటక రంగంలో ఆయన ప్రస్థానం మొదలైంది. క్రీడల్లో అవకాశం వచ్చినప్పుడల్లా బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటూ సత్తా చాటుతున్నాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మెరిసి ఎన్నో పతకాలు సాధించాడు. ప్రముఖులతో బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకొని శభాష్ అనిపించుకున్నాడు. టీజీ జెన్‌కో తరఫున నిర్వహించే ఇంటర్ ప్రాజెక్టు బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీలో పదేండ్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చాడు. ప్రథమ బహుమతి సాధించడంలో ఇతడే కీలకపాత్ర పోషించాడు. 40 ఏండ్ల క్రీడా అనుభవం ఉన్న ఆయన నిత్యం ఎందరో క్రీడాకారులకు శిక్షణనిస్తున్నాడు.

***నాటకరంగంలో..***

11 ఏండ్ల వయస్సు నుంచే నాటకరంగంపై ఉస్సేనప్ప ఆసక్తి చూపేవాడు. పాఠశాలలో చదివే రోజుల్లో చిల్డ్రన్స్‌డే సందర్భంగా వేసిన 'జబ్బు కుదిరింది' అనే నాటకంతో స్టేజ్‌షో వైపు ఆసక్తి చూపాడు. ఇక అక్కడి నుంచి వెనుతిరిగి చూడలేదు. జిల్లా, రాష్ట్ర స్థాయి నాటక ప్రదర్శనల్లో పాల్గొని ఎన్నో బహుమతులు గెలుచుకున్నారు. 1987లో కర్నూల్ జిల్లా స్థాయిలో ఉత్తమ బాలనటుడి అవార్డు పొందాడు. అతడి గురువు లక్ష్మినాయుడు.. కళామతల్లి ఆశీస్సులతో దూసుకెళ్తున్నాడు. మార్పు.. మా సీతా రాం తాతయ్య.. తంద్రులున్నారు జాగ్రత్త.. పిసినారీ పేరయ్య నాటికలు ఆయనకు మంచి గుర్తింపును తెచ్చాయి.



ఉత్తమ నటుడిగా అవార్డు పొందుతున్న ఉసేనప్ప

***బుల్లి, వెండితెరపై..***

2005లో టీవీ కామెడీ షోలలోకి ఉస్సేనప్ప ప్రవేశించారు. ఈ-టీవీలో ఆంధ్రావాలా షోలో కనిపించారు. 2007లో జీ-టీవీలో కామెడీషో, 2008లో వనితా టీవీలో కామెడీ సర్కస్, డీడీ సప్తగిరి చానెల్‌లో కామెడీ కితకితలు.. 2015లో ఈ-టీవీలో జబర్దస్త్ ప్రోగ్రామ్‌లో నటించాడు. ఇలా దాదాపు 20 ఎపిసోడ్స్ వరకు చేశాడు. 2020లో జీ-టీవీలో అందిరింది షో.. 2021లో హైదరాబాద్ రవీంద్ర భారతి, శిల్పకళావేదిక ఆడిటోరియంలో లైవ్ షోలలో పాల్గొన్నారు. కొన్ని సినిమాల్లో కూడా ఆయన నటించారు. హీరోయిన్ ప్రియమణి నటించిన చండీ సినిమాలో, జగపతిబాబు నటించిన అధినేత సినిమాలో.. శ్రీకాంత్ నటించిన సేవకుడు సినిమాలో యాక్టింగ్.. కమేడియన్‌గా గుర్తింపు పొందాడు. ఆయన మల్టీపుల్ టాలెంట్‌ను తోటి ఉద్యోగులు, క్రీడాకారులు, స్థానికులు అభినందించకుండా ఉండలేకపోతున్నారు. ఇలాంటి టాలెంట్ ఉన్న ఉద్యోగి తమ జెన్‌కోలో పనిచేయడం గర్వకారణమని శ్రీశైలం లెఫ్ట్ భూగర్భ జల విద్యుత్‌కేంద్రం చీఫ్ ఇంజినీర్ రామసుబ్బారెడ్డి కొనియాడారు.

## అకాల వర్షం

- పేట మార్కెట్‌లో తడిసిన 420 బస్తాల ధాన్యం

నారాయణపేట టౌన్, డిసెంబర్ 5 : అకాల వర్షానికి మార్కెట్‌లోని ధాన్యం తడిసింది. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు మొత్తం 4,331 బస్తాల ధాన్యాన్ని విక్రయించేందుకు సమీప గ్రామాలకు చెందిన రైతులు తీసుకొచ్చారు. అయితే మధ్యాహ్నం ఒక్కసారిగా వాన రావడంతో కర్షకులు టార్పాలిన్ కవర్లు ధాన్యంపై కప్పేలోగా చాలా వరకు తడిసిపోయింది. రైతులకు చెందిన 20 బస్తాలు, ఖరీదుదారులకు సంబంధించి 400 బస్తాలు తడిసింది. వర్షం తగ్గాక కొట్టుకు పోతున్న ధాన్యాన్ని రైతులు సేకరించి ఒక్కచోటుకు చేర్చారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటిపాలవడంతో రైతన్న గుండె తరుక్కుపోయింది. మరి కొందరు కవర్లు కప్పి తడవకుండా కాపాడుకున్నారు.



నారాయణపేట వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం



పేట మార్కెట్‌లో తడిసిన ధాన్యం చూపిస్తున్న రైతు

**నేడు కొనుగోళ్లు నిలిపివేత**

అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ధాన్యం కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ శివారెడ్డి తెలిపారు. మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని గురువారం ఆయన పరిశీలించారు. టెండర్లు వేసిన ధాన్యానికి తూకాలు వేస్తామని, మార్కెట్‌కు ఎవరూ ధాన్యం తేవొద్దని సూచించారు. కందుల కొనుగోళ్లు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు. ఆయన వెంట డైరెక్టర్ శరనప్ప, సెక్రటరీ భారతి, సూపర్‌వైజర్ లక్ష్మణ్, రైతులు ఉన్నారు.